తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 24 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

## కాంగ్రెస్ నాయకుల ఆధిపత్య పోరుతో..

# కుంటుపడుతున్న మోత్కూరు మున్సిపల్ అభివృద్ధి

- మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి
- బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను

- ఎమ్మెల్యే సామేల్ స్వంతంగా తెచ్చిన నిధులతో ఒక్క పనైనా చేశారా
- స్వంత కౌన్సిలర్లు అడుగుతున్నా నిధుల లెక్కలెందుకు చెప్పడం లేదు
- ఎమ్మెల్యే చేతగానితనంతోనే కోఆప్షన్ మెంబర్ల నియామకం జరగడం లేదు
- బీఆర్ఎస్ నాయకులపై ఎగడం కాదు..అభివృద్ధి చేయండి..లేదంటే రాజీనామా చేయండి





ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాయకుల ఆధిపత్య పోరుతో మున్సిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో మున్సిపల్ పాలకవర్గం, ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర విభేదాలతో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాజకీయం చేస్తుండటంతో వారి ఆటలో మోత్కూరు మున్సిపాలిటీ చిత్తైపోతుందన్నారు. మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి చేస్తారని ప్రజలు భావించి కాంగ్రెస్‌ను గెలిపించారని, కానీ రాజకీయ ఆధిపత్య పోరుతో మీపై మీరే కేసులు పెట్టుకుంటున్నారని, దీంతో మున్సిపాలిటీకి తీరని నష్టం జరుగుతుందని, ఇందుకోసమేనా ప్రజలు మిమ్ములను గెలిపించింది అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై ఎగిరి గంతేస్తున్న ఎమ్మెల్యే సామేల్ ఇచ్చిన హామీలు ఆర్టీసీ బస్ డిపో, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, 30పడకల ఆస్పత్రి అప్‌గ్రేడ్, పోస్టుమార్టం ఎటుపోయాయన్నారు. మూడేళ్ల కాలంలో ఎమ్మెల్యే సామేల్ స్వంతంగా తెచ్చిన నిధులతో ఒక్క పనైనా ప్రారంభించి పూర్తి చేసింది ఉందా అని చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో డబుల్ రోడ్డు విస్తరణ మొదలు కొని మున్సిపల్ కొత్త భవనం, స్మశాన వాటిక, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సీసీ రోడ్లు, మురికి కాల్వలు లాంటి పనులన్నీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంజూరు చేయించిన నిధులేనన్నారు. మున్సిపల్ కొత్త భవనం, స్మశాన వాటిక పనులు ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే సామేల్ చేతగాని తనంతోనే నేటికీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల నియామకం జరగడం లేదని తెలిపారు. స్వంత పార్టీ కౌన్సిలర్లే ఎమ్మెల్యే సామేల్‌ను నిధులు లెక్కలేమిటని అడుగుతుంటే ఎందుకు చెప్పడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్వంత పార్టీ కౌన్సిలర్లకు, ప్రజలకు సమాధానం చెప్పలేక ఎమ్మెల్యే సామేల్ దున్నపోతుల ముచ్చటంటూ బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే సామేల్ ముందుగా స్వంత పార్టీని చక్కపెట్టుకుని ఆ తర్వాత నీతులు చెప్తే బాగుంటుందన్నారు.

# రాపాక పెంటయ్య మరణం తీరని లోటు

## భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజావారధి/శాలిగౌరారం**
శాలిగౌరారం గ్రామ పంచాయితీ పరిధిలోని పావురాలగూడెం గ్రామంలో ప్రముఖ ఫోటో, వీడియో గ్రాఫర్, నాయకుడు రాపాక రాజు తండ్రి పెంటయ్య ఇటీవల మరణించగా బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెంటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నూక కిరణ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత ధనుంజయ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, సర్పంచ్ గుజిలాల్ శేఖర్‌బాబు, మార్కెట్ మాజీ చైర్మన్ చాడ సురేష్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తోటకూరి పరుశరాములు, మాజీ ఎంపిటీసీ జోగు సైదమ్మశ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్, మండల అధ్యక్షులు బొల్లికొండ గణేష్ యాదవ్, పెరుమాండ్ల నరేష్, జమ్ము అశోక్, వార్డు సభ్యులు తండ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మద్ది వెంకటరెడ్డి మాతృమూర్తి మద్ది లక్ష్మమ్మ అనారోగ్యం తో మరణించడంతో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# శాలిగౌరారంలో ఘనంగా వినాయక నిమజ్జనం





ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు నవరాత్రులు ఘనంగా పూజలు చేసిన అనంతరం బుధవారం శాలిగౌరారం ప్రాజెక్టులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనం రోజున పోలీసుల హెచ్చరికల మేరకు డీజే సౌండ్ సిస్టమ్ లేకుండా సంప్రదాయ కోలాట ప్రదర్శనతో నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద గణపతి బప్పా మోరియా నినాదాల నడుమ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.